క్లుప్తంగా

కాంట్రాక్టు అధ్యాపకుల బోనాల ర్యాలీ

లాలాపేట: తమను రెగ్యులరైజ్ చేయాలని ఓయూ క్యాంపస్‌లోని కాంట్రాక్టు అధ్యాపకులు బుధవారం క్యాంపస్‌లోని ఎల్లమ్మ దేవాలయంలో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అంతకు ముందు మహిళా అధ్యాపకులు బోనాలతో ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కాంట్రాక్టు అధ్యాపకులు గత కొన్ని రోజుల నుంచి వివిధ రూపాల్లో నిరసన వ్యక్తం చేస్తున్నారు. అధ్యాపకులు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ స్పందించి తమను రెగ్యులరైజ్ చేయాలని ఎల్లమ్మ తల్లిని వేడుకున్నట్లు పేర్కొన్నారు.

క్యాంపస్‌లో మొబైల్ సేవలు విస్తృతం

లాలాపేట: ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలంటే మొబైల్ సెల్యూలర్ సిగ్నల్ తప్పనిసరి కావడంతో ఓయూ క్యాంపస్ వ్యాప్తంగా అవసరమైన మేరకు సెల్ టవర్లను ఏర్పాటు చేసి మొబైల్ సేవలను విస్తృతం చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వైస్ చాన్సలర్ ప్రొ. రవీందర్ తెలిపారు. క్యాంపస్‌లో సెంటినరీ బాలికల హాస్టల్ విద్యార్థుల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన సెల్యూలర్ మొబైల్ టవర్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సెల్ టవర్‌తో బాలికల హాస్టల్‌తో పాటు పక్కనే ఉన్న మిగతా హాస్టళ్లు, ఐసీఎస్ఎస్ఆర్–అంతర్జాతీయ అధ్యాయన కేంద్రం ఈ సేవలను వినియోగించుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. రిజిస్ట్రార్ ప్రొ లక్ష్మీ నారాయణ, నవీన్‌కుమార్, డీన్లు, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

సనత్‌నగర్: ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశాల కోసం రెండో విడత దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బసిరెడ్డి వెంకటరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానిక్ మోటార్ వెహికల్, రిఫ్రిజిరేటర్ అండ్ కండిషనింగ్, ఫిట్టర్, పెయింటర్, వెల్డర్, కోపా ట్రేడ్‌లలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. పది ఉత్తీర్ణులై ఆయా ట్రేడ్‌లలో చేరే అభ్యర్థులు జీజీజీ.ఐఐఐ.జౌరి.జీ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు ట్రైనింగ్ ఆఫీసర్ రాములు 8919190943, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీదేవి 9704529396 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆస్పత్రి ఏర్పాటు చేయకుంటే ఉద్యమిస్తాం

లాలాపేట: ఓయూ క్యాంపస్ మాణికేశ్వర్‌నగర్‌లో హాస్పిటల్ ఏర్పాటు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని సికింద్రాబాద్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు నోముల ప్రకాష్ రావు అన్నారు. చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మిద్దామంటూ మాణికేశ్వర్‌నగర్ అఖిల పక్షం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష 100 రోజులకు చేరాయి. బుధవారం చేపట్టిన దీక్షలకు నోముల ప్రకాష్‌రావు హాజరై దీక్షను ప్రారంభించడంతో పాటు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఉద్యమాల గడ్డగా పేరుగాంచిన ఓయూ క్యాంపస్‌కు ఉద్యమ కాలంలో వెన్నుదన్నుగా నిలిచిన బస్తీ వాసులకు వైద్య సదుపాయం లేక దయనీయమైన పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వేముల శ్రీనివాస్, నర్సింహ్మ,లాజరస్, లింగయ్య, గండికోట విజయ్‌కుమార్, ఆలకుంట హరి పాల్గొన్నారు.

విద్యార్థుల ఆందోళనకు ఆకునూరి మురళి మద్దతు

లాలాపేట: కెమిస్ట్రీ ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సును పునరుద్ధరించాలని విద్యార్థులు చేస్తున్న ఆందోళనకు బు ధవారం మాజీ ఐఏఎస్ అధికారి ఆకునూరి ము రళి మద్దతు ప్రకటించారు. విద్యార్థులతో కలిసి ఓ యూ పాలనా భవనం ఎదుట ధర్నాలో కూర్చున్నారు. అ నంతరం ఆర్ట్స్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు.

సమస్యలపై గళం వినిపించాలి

లాలాపేట: దేశంలోని విద్యార్థి, యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పార్లమెంట్‌లో తన గళాన్ని వినిపించాని ఉస్మానియా యూనివర్సిటీ మాజీ జాయింట్ రిజిస్ట్రార్ ఎల్లేష్, సీపీఐ రాజ్యసభ సభ్యులు సంతోష్‌కుమార్‌ను కోరారు. సీపీఐ నుంచి రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన తర్వాత మొదటిసారిగా హైదరాబాద్‌లో జరుగుతున్న ఏఐవైఎఫ్ నేషనల్ వర్క్‌షాప్‌కు హాజరైన ఆయనను బుధవారం ఎల్లేష్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

బాసర ఐటీలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి సీటు

అమీర్‌పేట: అమీర్‌పేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని ఎ.గాయత్రికి బాసర ఐటీలో సీటు లభించింది.ఇటీవల విడుదలైన పది ఫలితాల్లో 10 కి 10 సాధించిన గాయత్రి బాసర ఐటీలో దరఖాస్తు చేసుకోగా సీటు లభించింది.ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి బుధవారం తన కార్యాలయంలో సదరు విద్యార్థిని అభినందించారు.

బోనాలకు సర్వం సిద్ధం

నేడు మూసాపేటలో ఆషాఢమాస బోనాలు



విద్యుత్ దీపాలంకరణలో పోచమ్మతల్లి ఆలయం కమాన్



మూసాపేట: మూసాపేటలో ఆషాఢమాస బోనాల ఉత్సవాలు గురువారం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు ఆలయ నిర్వాహకులు చేస్తున్నారు. సుమారు వంద, రెండు వందల సంవత్సరాల క్రితం గ్రామ దేవతలుగా అమ్మవార్లను ప్రతిష్ఠించారు. అప్పట్లో గ్రామంలో రోగాలు ప్రబలుతున్నప్పుడు గ్రామ పెద్దలు కలిసి గ్రామ దేవతలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. భవానీనగర్‌లోని పోచమ్మ తల్లి, మూసాపేట ప్రభుత్వ పాఠశాల వద్ద ఉన్న మహంకాళి అమ్మవారు, గూడ్స్‌షెడ్ రోడ్డులోని ముత్యాలమ్మ తల్లి, ప్రధాన రహదారిలోని నల్లపోచమ్మ తల్లిని గ్రామ దేవతలుగా ఇప్పటికీ పూజలు నిర్వహిస్తూ కొలుస్తున్నారు. ప్రత్యేకంగా నగరంలోని బోనాల పండుగకు ముందే బోనాల మొక్కులు తీర్చుకుంటారు.

నాగలితో దున్నుతుండగా..



మూసాపేట ప్రభుత్వ పాఠశాల వద్ద పురాతనమైన మహంకాళి, సరస్వతి అమ్మవారి ఆలయం ఉంది. సుమారు శతాబ్దం క్రితం ఇప్పుడు ఉన్న ప్రాంతమంతా పంటపొలాలతో ఉండేది. నాగలితో దున్నుతుండగా అమ్మవారి విగ్రహం నాగలికి తగిలింది. దీంతో అదే ప్రాంతంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తూ వస్తున్నారు. అమ్మవారికి ఆలయం నిర్మించి ఇప్పటికీ పూజలు చేస్తూ బోనాలు నిర్వహిస్తున్నారు.

పుట్టలో వెలసిన ముత్యాలమ్మ తల్లి

పూర్వకాలంలో పూజలు చేసిన అమ్మవారి విగ్రహం పుట్టలో పూర్తిగా కూరుకుపోయింది. కొన్నాళ్లకు గ్రామ పెద్దకు కలలో అమ్మవారు కనిపించి రావిచెట్టుకింద పుట్టలో ఉన్నానని.. ఆలయం నిర్మించాలని ఆదేశించిందని అప్పుడు గ్రామ పెద్ద ఆలయం నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. మళ్లీ 2008లో ఆలయాన్ని పునః ప్రారంభించారు.



భవానినగర్ పోచమ్మ తల్లికి మొదటి పూజ



మూసాపేట భవానీనగర్‌లోని పోచమ్మ తల్లికి మొదటి పూజ నిర్వహించిన తరువాత మిగతా ఆలయాల్లో పూజలు చేయటం ఆనవాయితీగా వస్తోంది. ఇక్కడి అమ్మవారిని శీతలిమాతగా కొలుస్తారు. ఎవరి కల్యాణం జరిగినా పెళ్లి చీరలను అమ్మవారి ముందు ఉంచి తీసుకెళ్లటం ఇక్కడ ప్రజల ఆనవాయితీ. ఇంట్లో ఎవరికి ఆరోగ్యం బాగా లేకపోయినా అమ్మవారికి సాక పోసి వేడుకుంటే తగ్గిపోతుందని భక్తుల విశ్వాసం.

కోర్కెలు తీర్చే నల్ల పోచమ్మ



మూసాపేట జాతీయ రహదారిపై ఉన్న ఆలయానికి నిత్యం ఎంతో మంది భక్తులు దర్శనం చేసుకుంటారు. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో 1996లో అదే స్థానంలో పునఃప్రతిష్ఠించారు. కోరిన కోర్కెలు నెరవేర్చే చల్లని తల్లిగా అమ్మవారు కొలువుదీరి ఉంది. ఆలయ వార్షికోత్సవం, బోనాల పండుగ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఆయా ఆలయాల్లో ఉదయం నుంచి అమ్మవారికి మొక్కులుగా బోనాలు సమర్పిస్తారు. ఆదివారం చిత్తారమ్మ తల్లి బోనాల జాతర ఉంటుంది.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

కూకట్‌పల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ ఏఈ బి. శరత్‌బాబు ఓ ప్రకటనలో తెలిపారు.

- చివరి బస్‌స్టాప్ ఫీడర్ పరిధిలోని ధరణినగర్, కాకతీయనగర్, ఆదిత్యానగర్, చివరి బస్‌స్టాప్, ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2, జలకన్య, చక్రధర్‌నగర్‌లో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు..
- జలకన్య ఫీడర్ పరిధిలోని తులసినగర్, భూదేవి హిల్స్, జలకన్య, శివనగర్ ప్రాంతాల్లో ఉదయం 12.30 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు..
- ఆల్విన్‌కాలనీ ఫీడర్ పరిధిలోని ఆల్విన్‌కాలనీ ఫేజ్–1, జలకన్య, ఈస్ట్ అండ్ వెస్ట్ సాయినగర్‌లలో మధ్యాహ్నం 2గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

అల్లాపూర్, పద్మావతి ఫీడర్ల పరిధిలోని..

మోతీనగర్: అల్లాపూర్ ఫీడర్ పరిధిలోని గాయత్రినగర్, హమాలి బస్తీ, శివ బస్తీ, ఫ్రెండ్ కాలనీ, అల్లాపూర్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు..

- పద్మావతి ఫీడర్ పరిధిలోని జేకే ఫంక్షన్‌హాల్, మహబూబ్ ఫంక్షన్‌హాల్, న్యూ అల్లాపూర్, పద్మావతినగర్, కేఎస్‌నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఏఈ కె. శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

శ్రీనివాసం, పీజేఆర్ నగర్ ఫీడర్ల పరిధిలో..

భాగ్యనగర్‌కాలనీ: శ్రీనివాసం ఫీడర్ పరిధిలోని హెచ్‌ఎంటీహిల్స్ సబ్‌స్టేషన్ పరిధిలోని జయనగర్, భాగ్యనగర్ కాలనీ, అరుణ సొసైటీలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు.

- పీజేఆర్ నగర్ ఫీడర్ పరిధిలోని శంషీగూడ సబ్ స్టేషన్ పరిధిలోని జన్మభూమి కాలనీ, పీజేఆర్‌నగర్‌లలో మధ్యాహ్నం 2 నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కమ్యూనిటీహాల్ నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేస్తాం



నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సమతనగర్‌లో కమ్యూనిటీహాల్ పై అంతస్తు నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. కులం, మతం, వర్గం, ప్రాంతం తేడా లేకుండా నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమ అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనులను త్వరలో పూర్తి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు ఇక్కడ జరిగిన అభివృద్ధిని చూసి తననే ఎమ్మెల్యేగా ఎన్నుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్, ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు కంచి భిక్షపతి, జనరల్ సెక్రటరీ సుదర్శన్‌రెడ్డి, కన్నయ్యా, నర్సింహులు, సుధాకర్‌రెడ్డి, రాజేందర్, విజయ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలి



ఆశావర్కర్లకు చీరలను అందజేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, డాక్టర్ మను

ఆల్విన్‌కాలనీ: ఆశావర్కర్లకు తెలంగాణ ప్రభుత్వం ఉచితంగా అందజేసిన చీరలను ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చేతుల మీదుగా ఎల్లమ్మబండ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ మను పప్పన్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ఎక్కువగా కృషి చేస్తోంది ఆశావర్కర్లే అని అన్నారు. ఆశావర్కర్లు ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు తెలియజేస్తున్నారని అన్నారు.

- సామాన్య ప్రజల్లో చైతన్యం కలిగించి వారు ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకునేలా కృషి చేస్తున్నారని తెలిపారు. అదే విధంగా గర్భిణీలు మొదటి నెల నుంచి ప్రసవం అయ్యే వరకు వారికి సమయానికి తీసుకోవాల్సిన మందులు, జాగ్రత్తలను వివరించే బాధ్యతలు చక్కగా నిర్వహిస్తున్నారని తెలిపారు. డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, పోశెట్టిగౌడ్, రాములుగౌడ్, కూర్మయ్య సాయిగౌడ్, మోజెస్, హాస్పిటల్ సిబ్బంది భవాని, ప్రియాంక, సుశీల, రాధ, సంతోషి, శశిరేఖ, జ్యోతి, సీతారాం పాల్గొన్నారు.

గుడ్ మార్నింగ్ ఆల్విన్‌కాలనీ



సమస్యల పరిష్కారానికి శంషీగూడ ప్రాంతంలో పర్యటిస్తున్న యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్

భాగ్యనగర్‌కాలనీ: గుడ్ మార్నింగ్ ఆల్విన్‌కాలనీ మూడవ విడతలో భాగంగా బుధవారం యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్ శంషీగూడ పరిధిలోని మహంకాళి నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా వీధుల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ పర్యటనలో తన దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరిస్తామన్నారు. వీధి దీపాలు లేవనే విషయాన్ని ఎమ్మెల్యే, కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాశీనాథ్‌యాదవ్, శివరాజ్‌గౌడ్, రమేష్, శ్రీనివస్, ప్రదీప్‌రెడ్డి, మహేష్, ఇస్మాయిల్, సత్యనారాయణ పాల్గొన్నారు.

మంచి శిక్షణ పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు కూకట్‌పల్లి డివిజన్ ఏవీబీ పురం కాలనీలో ఖార్డ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మెషిన్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిక్షణ కేంద్రాన్ని బుధవారం కూకట్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, సంస్థ నిర్వాహకులు సుమన్ మల్లాదితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి పదిమందికి ఉపాధి కల్పించాలన్నారు. శిక్షణ పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. పరిసర ప్రాంత మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రాజెక్టు



కుట్టు మెషిన్ శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

డైరెక్టర్ మంజుల మల్లాది, సిబ్బంది లక్ష్మణ్, నవీన, సీఓ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ధూపదీప నైవేద్యాలకు రూ.10వేల అందజేత

కూకట్‌పల్లి: దేవాలయాల్లో నిత్యం ధూపదీప నైవేద్యాలు అందించడానికి ముఖ్యమంత్రి కేసీఆర్ కొన్ని దేవాలయాలు ఎంపిక చేసి అర్చకులకు రూ.10వేలను అందిస్తున్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఫతేనగర్, బాలానగర్‌లకు చెందిన 8 దేవాలయాలు ఎంపికయ్యాయి. బుధవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అర్చకులకు అందుకు సంబంధించిన అనుమతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని కులాలు, మతాల వారిని సమ ప్రాధాన్యతతో చూస్తున్నారని అన్నారు. వారి పండుగలకు దుస్తులు, నగదు అందిస్తూ సమానంగా చూస్తూ ముందుకెళుతున్నారన్నారు. అదే విధంగా హిందూ దేవాలయాల్లో నిత్యం ధూపదీ నైవేద్యాలకు ఈ



అనుమతి పత్రాలను అర్చకులకు అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

విధంగా నగదు అందజేయటం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కాండూరి నరేంద్రాచార్య, అర్చకులు పాల్గొన్నారు.

ప్రమాదం సంభవించకుండా చెట్ల కొమ్మలు తొలగించాలి

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని గాయత్రి నగర్ గణేష్ మండపం పార్కులైన్‌లో విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు ఆనుకొని ఉన్నాయి. ఈదురు గాలులు వీచినప్పుడు షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యే అవకాశం ఉందని స్థానికులు కార్పొరేటర్ సబిహా బేగం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆమె బుధవారం విద్యుత్ శాఖ అధికారులకు ఎక్కడ కొమ్మలైతే కరెంటు తీగలకు ఆనుకొని ఉన్నాయో వాటిని తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు విద్యుత్ అధికారులు స్పందించి చెట్ల కొమ్మలు తొలగించారు. ఈ కార్యక్రమంలో లైన్‌మెన్ భాస్కర్, సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంజీవరెడ్డి, జ్ఞానేశ్వర్, కాశీనాథ్‌చారి, సుదర్శన్, మల్లికార్జున్, జహంగీర్, పార్వతమ్మ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ మౌనదీక్షకు తరలిన కాంగ్రెస్ నాయకులు

కూకట్‌పల్లి: రాహుల్ గాంధీపై రాజకీయ కక్ష సాధింపునకు నిరసనగా బుధవారం గాంధీభవన్‌లో జరిగిన సత్యాగ్రహ మౌనదీక్షకు కూకట్‌పల్లి నియోజకవర్గం నుంచి మాజీ కార్పొరేటర్ గొట్టిముక్కల వెంగళరావు, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో రాహుల్ గాంధీ పోటీ చేయకూడదనే బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో నాయకులు మేకల రమేష్, కె. రమేష్ ముదిరాజ్, షఫీయుద్దీన్, సమీ, అస్లాం, గురుమూర్తి, ఏ బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, తూము వేణు, మధుగౌడ్, షాపుద్దీన్, కృష్ణ రాజ్‌పుత్, నరసింహయాదవ్, చోటా మోయిజ్, కేబుల్ శ్రీను, శేఖర్, బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు శోభా, కేపీహెచ్‌బీ డివిజన్ అధ్యక్షురాలు రజిత, ఎన్ఎస్‌యూఐ నాయకురాలు ప్రణతి తదితరులు పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరించారు



పీజేఆర్‌నగర్‌లో ప్రభుత్వం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్ నాయకుడు మారెల్ల శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: రైతులకు ఉచిత విద్యుత్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారెల్ల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎల్లమ్మబండ పీజేఆర్‌నగర్ వద్ద బుధవారం రైతులకి ఉచిత విద్యుత్ గురించి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడిన మాటల్ని వక్రీకరించిన ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులకు నిరసనగా ప్రభుత్వ దిష్టిబొమ్మను విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద దహనం చేశారు.

- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు ఇబ్బంది పడకుండా ఉచిత విద్యుత్ ఇస్తామన్న మాటకు కట్టుబడి మొదటి సంతకం దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పెట్టిన ప్రతి సంక్షేమ పథకం తొలగించకుండా ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా చిరకాలం గుర్తుండేలా పథకాలను రూపొందించిందన్నారు. చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడొద్దనే ఉచిత విద్యుత్ గురించి మాట్లాడితే బీఆర్‌యస్ నాయకులు ఎన్నికల్లో పబ్బం గడిపేందుకు ప్రజలు తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు సన్యాసిరావు, పంతులు, సుజాత రమణ, అత్తర్‌సింగ్, నారాయణ, బాలస్వామి, గోపాల్, బలరాం, గోపి, విజయ్‌కుమార్, కృష్ణ కుమారి తదితరులున్నారు.

రైతుల పొట్ట కొట్టేలా మాట్లాడటం సిగ్గుచేటు

- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై సర్వత్రా నిరసనలు
- నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను ఊరేగించి దహనం
- వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తగిన బుద్ధి చెబుతారు: ఎమ్మెల్యే



టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: తెలంగాణలో రైతును రాజును చేయాలనే సంకల్పంతో సీఎం కేసీఆర్ పని చేస్తుంటే విపక్షాలు ఓర్వలేక అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉచిత విద్యుత్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ఓల్డ్ బోయిన్‌పల్లి చౌరస్తాలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా తీసుకెళ్లారు.

- ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశానికి అన్నం పెట్టే రైతుకు అండగా నిలవాల్సింది పోయి వారి పొట్టమీద కొట్టేలా వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి, రైతుబంధు, రైతుబీమా, దళితబంధు లాంటి పథకాలను రద్దు చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, నర్సింగ్‌రావు, ఉదయ్‌యాదవ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, లలితా, బుర్రి యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాంగ్రెస్ తన నిజస్వరూపాన్ని బయటపెట్టుకుంది..

కూకట్‌పల్లి: రైతులకు ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి తానాసభలో చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు అన్నారు. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నియోజకవర్గం వ్యాప్తంగా రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. చౌరస్తాల్లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మాట్లాడుతూ... ఇది కేవలం కాంగ్రెస్ పార్టీ ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసే ఎత్తుగడ మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు వ్యతిరేక విధానానికి వ్యతిరేకంగా నిరసనలు చేపట్టామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు సరిపడా సాగునీరు, ఉచిత విద్యుత్, పంట పెట్టుబడి వంటి అనేక పథకాల అమలుతో రైతులు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారని అన్నారు. ఇలాంటి తరుణంలో కాంగ్రెస్ పార్టీ తన నిజస్వరూపాన్ని బయట పెట్టుకుందన్నారు.



కూకట్‌పల్లిలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ



ఫతేనగర్ డివిజన్‌లో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ సతీష్‌గౌడ్



బాలానగర్‌లో నిరసన తెలుపుతున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి